








# 60 ఏళ్ల వారధి.. సరైన దారేది..

- అధ్వానంగా మారుతున్న పట్టింపేది
- ప్రమాదాలకు నిలయంగా మారుతున్న వైనం
- శాసనసభ్యులు కూతవేటు దూరంలో ఉన్న ప్రమాదాలు కనపడవు.. ఆర్తనాదాలు వినపడవు
- పూర్తవ్వని కొత్త బ్రిడ్జి, నాసిరకంగా నిర్మాణం

**గత ప్రభుత్వం శీతకన్ను ఈ ప్రభుత్వం నిర్లక్ష్యం ఎందుకింత వివక్ష భద్రాద్రి రాముడికి అప్రదిష్ట**

**భద్రాచలం సెప్టెంబర్ 29 ( డిడి9 వార్త ) :** గోదావరి నదిపై భద్రాచలంలో 1964-65 ప్రాంతంలో నిర్మించబడిన తొలి వారధి నేడు 60 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఒకప్పుడు పల్లెల నుండి పట్టణానికి, పట్టణం నుండి దూర ప్రాంతాలకు వెళ్లే ప్రజలకు ఇది ప్రాణధారంగా మారి అద్భుతమైన సౌకర్యాన్ని కల్పించింది. గోదావరి ఒడ్డున భద్రాచలం అభివృద్ధికి ఈ వారధి కీలక పాత్ర పోషించింది. రవాణా, వాణిజ్యం, యాత్రికుల ప్రయాణం - అన్నింటికీ ఈ వారధి కేంద్ర బిందువైంది. భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం, దక్షిణ అయోధ్యగా, తిరుపతి తర్వాత అత్యంత ప్రాముఖ్యత కలిగిన పుణ్యక్షేత్రంగా దేశవ్యాప్తంగా విరాజిల్లుతోంది. ప్రతిరోజూ వేల సంఖ్యలో భక్తులు సీతారాముల దర్శనం కోసం ఇక్కడికి తరలివస్తుంటారు.భద్రాచలం ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పేలా ఉండాల్సిన ప్రవేశ మార్గమే అధ్వానంగా గుంతలతో తయారయింది. కానీ, కాలం గడుస్తున్న కొద్దీ ఈ వారధి రోజు రోజుకీ అధ్వాన స్తితికి చేరుకుంటోంది. ఒకప్పుడు గర్వ కారణంగా నిలిచిన ఈ వారధి నేడు వారధికి మధ్యలో చాలా చోట్ల లోతైన గుంతలు ఏర్పడి , ఐరెన్ రాడ్స్ బయటికి రావడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, లారీలు, RTC బస్సులు , స్కూల్ బస్సులు, ప్రతిరోజూ వందల సంఖ్యలో వాహనాలు ఇక్కడుగా ప్రయాణిస్తున్నాయి. అయితే గుంతల్లో చిక్కుకుని వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. రాత్రి సమయాల్లో గుంతలు కనపడకపోవడంతో ద్విచక్ర వాహనదారుకు లోతైన గుంతల్లో పడి ప్రమాదానికి గురవుతున్నారు అని స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### *60 ఏళ్ల చారిత్రక వారధిని రక్షించాలి*

గుంతలను పూడ్చి, పూర్తి స్థాయి మరమ్మతులు చేసి, అవసరమైతే ఆధునికీకరించి ప్రజలకు సురక్షిత రవాణా కల్పించాలి. అప్పుడే ఈ వారధి మరోసారి ప్రాణధారంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. భద్రాచలం గోదావరి వారధి ఒక చారిత్రక వారసత్వం మాత్రమే కాదు, లక్షలాది ప్రజల ప్రాణాలకు ఆపన్నహస్తం కూడా. దానిని కాపాడడం అధికారుల బాధ్యత అని స్థానికులు కోరుతున్నారు. అలాగే పోలీస్ అధికారులు వారధి ఫారెస్ట్ చెక్ పోస్ట్ వద్ద వాహనాదారుల వేగాన్ని నియంత్రించేందుకు పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇకనైనా తక్షణమే ప్రభుత్వ అధికారులు స్పందించి వారధి పై ఏర్పడ్డ లోతైన గుంతలకు మరమ్మత్తులు చేపించి ప్రజలు ప్రాణాలు కాపాడాలని వాహనదారులు కోరుతున్నారు.

### *18 నెలలుగా పూర్తి కానీ కొత్త వారధి*

భద్రాచలం కొత్త వారది శ్రీరామనవమి సందర్భంగా 2024లో హడావుడిగా ప్రారంభించారు సుమారు 18 నెలలు గడుస్తున్నా, ఇప్పటికీ పనులు పూర్తవ్వలేదు అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా వంతెనపై లైట్లు లేకపోవడం, వర్షపు నీరు నిలిచిపోవడం, అసంపూర్తిగా ఉన్న ఫుట్‌పాత్ నిర్మాణాల పట్ల అధికారుల పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మద్యన కురుస్తున్న వర్షాలకు నూతన వారధిపై నీరు నిలిచిపోవడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వంతెనపై నీరు నిలవడంతో ద్విచక్ర వాహనదారులు జారిపడతామేమో అనే భయాందోళనలో ప్రయాణం చేస్తున్నారు. నీటితో పాటు బురద, పిచ్చి మొక్కలు పేరుకుపోవడంతో వంతెన పరిశుభ్రత ప్రశ్నార్థకంగా మారింది. నీరు నిలిచి వాహనదారులకు ప్రమాదం పొంచి ఉన్నా పట్టించుకునే నాథుడు లేడు అని ప్రజలు మండిపడుతున్నారు. ముఖ్యంగా సారపాకలోని ఐటీసీలో డ్యూటీ అయిపోయిన తర్వాత ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ఉద్యోగులు, సాధారణ ప్రజలు లైట్లు లేక నానా అవస్థలు పడుతున్నారు. గతంలో కూడా ఈ వంతెనపై లైట్లు లేక ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు అనేకం ఉన్నయన్న విషయాన్ని ప్రజలు గుర్తు చేస్తున్నారు.ప్రమాదం జరిగితేనే పట్టించుకుంటారా?" అని అధికారులు, ప్రజాప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరగకముందే అధికారులు ఇకనైనా నూతన బ్రిడ్జిపై దృష్టి సారించి, వర్షపు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని, వెంటనే లైట్లు ఏర్పాటు చేయాలని, అలాగే వారధిపై పెరుగుతున్న మొక్కలను, బురదను తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.







